పాడిరైతుల ముంగిటకే పశువైద్యం


డాక్టర్ వైఎస్సార్ పశువైద్య సంచార వాహనం


పశువును అంబులెన్స్ ఎక్కిస్తున్న సిబ్బంది


అంబులెన్స్ వద్ద పశువుకి వైద్యసేవలు అందిస్తున్న దృశ్యం

- అక్కరకు వస్తున్న పశువైద్య సంచార వాహనాలు
- ప్రతి నియోజకవర్గంలో రెండు వాహనాలు
- 1962 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేస్తే పశువు చెంతకు వైద్య సేవలు

ద్వారకాతిరుమల: ఎలాంటి పరిస్థితుల్లోనూ వైద్యం అందక ఒక్క మూగజీవి కూడా మృతి చెందకూడదని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అన్ని రకాల సౌకర్యాలు కల్పించింది. దేశంలోనే ఏ రాష్ట్రంలో లేనివిధంగా పశువైద్య సేవల్లో సమూల మార్పులు చేపట్టింది. గతంలో చిన్న జబ్బు చేసినా పశువైద్యులు లేక, జీవాలను ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లలేక పశుపోషకులు పడిన అవస్థలు వర్ణనాతీతం. చివరకు ప్రైవేట్ వైద్యులను ఆశ్రయించి చికిత్స చేయించేవారు. కొన్నిసార్లు ఆ వైద్యుడు వచ్చే లోపు జీవి మృతి చెందేది. ప్రస్తుతం ఒక్క ఫోన్ కాల్‌తో పశువు ఉండే చోటుకే నిపుణులైన వైద్యులు వచ్చి వైద్యం అందిస్తున్నారు. గ్రామ గ్రామాన వైద్యసహాయకులను నియమించి సేవలను అందుబాటులోకి తెచ్చింది. మూగజీవాల ఆరోగ్య పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. పశువైద్యంలో నాలుగున్నరేళ్లలో ఎన్నో విప్లవాత్మక మార్పులను తీసుకొచ్చింది. పశువైద్యం కోసం పాడి రైతులు, జీవాల పెంపకందారులు ఇబ్బంది పడకూడదని వారి ముంగిటకే పశు వైద్యసేవలను అందించడానికి వెటర్నరీ సహాయకులను నియమించింది. పశువైద్య సంచార వాహనాలను ఏర్పాటు చేసి 1962 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేస్తే చెంతకే వచ్చి వైద్య సేవలను అందిస్తున్నారు.

సేవలను సద్వినియోగం చేసుకోండి



మూగ జీవాలకు కూడా వైద్య సేవలు సకాలంలో అందించాలని ప్రభుత్వం గ్రామ స్థాయిలోనే ఆర్బీకేల్లో వెటర్నరీ సహాయకులను నియమించింది. ప్రతి ప్రాంతీయ పశు అసుపత్రి నుంచి గ్రామీణ పశు అసుపత్రి వరకు పశు వైద్య సహాయకులు ఉన్నారు. ప్రతి నియోజకవర్గానికి రెండు డాక్టర్ వైఎస్సార్ పశువైద్య సంచార వాహనాలు(అంబులెన్స్‌లు) అందుబాటులో ఉన్నాయి. పాడి రైతులు ఆర్థికంగా నష్టపోకూడదని ప్రభుత్వం రైతు ముంగిటకే వైద్య సేవలను అందించడానికి అన్ని ఏర్పాట్లు చేసింది. ప్రభుత్వం అందిస్తున్న సేవలను పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలి.

– అంగర సురేష్, పశువైద్యాధికారి, ద్వారకాతిరుమల మండలం

మార్పులు ఇలా..

గోపాలపురం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో పశువైద్య శాలలు 9 ఉన్నాయి. అలాగే ప్రాంతీయ పశువైద్య శాలలు మరో 2 ఉన్నాయి. నియోజకవర్గ రైతులకు నల్లజర్ల, గోపాలపురంలోని రెండు అంబులెన్స్‌లు అందుబాటులో ఉన్నాయి. భీమడోలు అంబులెన్స్ సైతం ద్వారకాతిరుమల మండల రైతులకు అందుబాటులో ఉంటోంది.

- గ్రామానికి ఒక ఆర్బీకేతో పాటు గోపాల మిత్ర వంటి వారితో పశువైద్య సేవలను అందిస్తున్నారు.
- గ్రామస్థాయిలో ఆర్బీకేల ద్వారా పశుగ్రాసం సర్టిపై చేసిన నాణ్యమైన సంపూర్ణ మిశ్రమ దాణా పంపిణీని పాడి రైతు ముంగిటకే అందిస్తున్నారు.
- ప్రతి నియోజకవర్గ కేంద్రంలో పశు వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసే ప్రయోగశాలలను ఏర్పాటు చేశారు.
- అత్యవసర వైద్య సేవలను అందించడానికి నియోజకవర్గానికి రెండు డాక్టర్ వైఎస్సార్ పశు వైద్య సంచార వాహనాలను (అంబులెన్స్) ఏర్పాటు చేశారు.
- ప్రతి అంబులెన్స్‌లో వెటర్నరీ సహాయకులు, డ్రైవర్ కం అటెండర్లను నియమించారు.
- ప్రాంతీయ పశువైద్య కేంద్రాల నుంచి గ్రామీణ పశువైద్య కేంద్రాల వరకు డివిజన్లో 30 మంది స్పెషలిస్ట్ వైద్యులతో పాటు 40 పశు వైద్య సహాయకులను నియమించింది.
- ప్రతి వాహనంలో వైద్య పరికరాలతో పాటు పేడ సంబంధిత, రక్త పరీక్షలను చేసేలా చిన్న పాటి లేబొరేటరీని సమకూర్చారు.
- ప్రతి అంబులెన్స్‌లో 81 రకాల మందులను అందుబాటులో ఉంచారు.
- ఈ వైద్య సేవలను అందుకోవడానికి 1962 టోల్ ఫ్రీ నంబర్‌ను కేటాయించారు. దీంతో ఆ నంబర్‌కు కాల్ చేస్తే పశువు ఉండే చోటుకు వచ్చి వైద్య సేవలను అందిస్తారు.
- అత్యవసర పరిస్థితి ఎదురైతే పశువును అదే వాహనంలో పశువైద్య కేంద్రానికి తరలించి చికిత్స అందించి, నయమైన తరువాత ఇంటికి వచ్చి వదిలిపెడతారు.
- నాణ్యమైన పాల ఉత్పత్తులు లక్ష్యంగా రైతులకు విజ్ఞాన బడుల ద్వారా అవగాహన కల్పిస్తున్నారు.
- పశువులకు బీమా రక్షణ సదుపాయం
- జనరిక్ పశు ఔషధ కేంద్రాలను ఏర్పాటు చేసి మందులను అందిస్తుంది.

క్లుప్తంగా

టెన్నీకాయిట్‌లో విద్యార్థి ప్రతిభ


టెన్నీకాయిట్‌లో జాతీయస్థాయిలో సిల్వర్ మెడల్ సాధించిన విద్యార్థిని అభినందిస్తున్న దృశ్యం

చింతలపూడి: చింతలపూడి అర్చణ జూనియర్ కళాశాలలో చదువుతున్న ఎం.పవన్‌కుమార్ జాతీయ స్థాయి టెన్నీకాయిట్‌లో ప్రతిభ కనబరిచాడు. రాజస్థాన్‌లోని శ్రీమహావీర్‌జీ ప్రాంతంలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో ఆంధ్రప్రదేశ్ నుంచి పవన్‌కుమార్ ప్రాతినిధ్యం వహించాడని కళాశాల డైరెక్టర్ బి.వసంత్‌కుమార్, ప్రిన్సిపాల్ బి.ముత్యవతి తెలిపారు. ఈ పోటీల్లో ద్వితీయ స్థానం సాధించి సిల్వర్ మెడల్ సాధించాడని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థికి శిక్షణ ఇచ్చిన ప్రకాష్‌రెడ్డి, కొండలను అభినందించారు. కాగా, తాను ఈ స్థాయికి రావడానికి శిక్షణ ఇచ్చిన, ఆర్థికంగా సహకరించిన వారికి పవన్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

జంగారెడ్డిగూడెం మున్సిపల్ కమిషనర్‌గా రమేష్‌బాబు



జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం మున్సిపల్ కమిషనర్‌గా ఎం.రమేష్‌బాబు నియమితులయ్యారు. ఈయన శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తూ బదిలీపై జంగారెడ్డిగూడెం రానున్నారు. కాగా, ఇక్కడ ఇప్పటి వరకు మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న పి.భవానీ ప్రసాద్‌ను ఏపీ సీడీఎంఏకు రిపోర్ట్ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

నేటినుంచి విద్యుత్ సరఫరాకు అంతరాయం

ద్వారకాతిరుమల: మండలంలోని గుణ్ణంపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో కొత్త బ్రేకర్ ఏర్పాటు పనులు జరుగుతున్న కారణంగా బుధవారం నుంచి గుణ్ణంపల్లి, రాజుపాలెం, జాజులకుంట సబ్‌స్టేషన్లలో తెల్లవారుజామున 3 గంటల నుంచి ఉదయం 9 గంటల వరకు త్రీఫేజ్ కరెంటును సరఫరా చేయనున్నట్టు ఆ శాఖ ఈఈ నటరాజన్ ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే మారంపల్లికి రెండు రోజులపాటు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. అదే విధంగా ఎం.నాగులపల్లి సెక్షన్‌లోని గుణ్ణంపల్లి, మహదేవపురం, కప్పలకుంట, సత్తాల, సంద్రకుంట, లక్ష్మీనగర్, బుట్టాయిగూడెం గ్రామాల్లో ఇదే పరిస్థితి కొనసాగుతుందని తెలిపారు. కావున ఆయా గ్రామాల ప్రజలు, రైతులు గమనించి, తమకు సహకరించాలని ఆయన కోరారు.

మార్చి 16కి జాతీయ లోక్‌అదాలత్ మార్పు


జూనియర్ సివిల్ జడ్జి కిషోర్ కుమార్

జంగారెడ్డిగూడెం: మార్చి 9వ తేదీన జరగవలసిన జాతీయ లోక్‌అదాలత్ మార్చి 16వ తేదీకి మార్పు చేయడం జరిగిందని చైర్మన్, మండల న్యాయ సేవాధికార సంస్థ, జూనియర్ సివిల్ జడ్జ్ సీహెచ్ కిషోర్ కుమార్ తెలియజేశారు. ఈమేరకు రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ నుంచి అందిన ఉత్తర్వులు వెలువడ్డాయని, ఈ విషయాన్ని గమనించి న్యాయవాదులు, కక్షిదార్లు తమ కేసులను మార్చి 16వ తేదీకి రాజీ చేసుకొనుటకు సంసిద్ధం అవ్వాలని తెలిపారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష

జంగారెడ్డిగూడెం: పట్టణంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని బుధవారం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షులు చిటికెల అచ్యుత రామయ్య ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని 8వ వార్డు సచివాలయం అశ్వారావుపేట రోడ్-2కు సంబంధించి శ్రీనివాసపురం రోడ్‌లో సీఎస్‌టీఎస్ డిగ్రీ కళాశాలలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటలకు వరకు ఈ వైద్యశిబిరం నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రజాప్రతినిధులు ఆరోగ్య సురక్షను ప్రారంభిస్తారని, ప్రజలు ఈ వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

అన్నప్రసాద వితరణ


అన్నప్రసాద వితరణ చేస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: శ్రీ వల్లీ దేవసేన సమేత సుందర బాలసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం వద్ద అన్నప్రసాద వితరణ కమిటీ వారిచే మంగళవారం అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో 1500 మంది భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారని తెలిపారు. ప్రతి మంగళవారం నిర్వహిస్తున్న అన్నప్రసాద కార్యక్రమంలో భక్తులు పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించాలని కోరారు. కార్యక్రమానికి సహకరించిన దాత గన్నమని శ్రీనివాస్, నిర్మలను కమిటీ సభ్యులు సన్మానించారు. ఆలయ అన్న ప్రసాద వితరణ కమిటీ అధ్యక్షుడు కానూరి గంగాధరరావు, సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం


గంగవరంలో పుంత రోడ్డు నిర్మాణానికి భూమి పూజలు నిర్వహిస్తున్న ప్రజాప్రతినిధులు

కొయ్యలగూడెం: గంగవరం గ్రామంలో అభివృద్ధి పనులకు మంగళవారం జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో శ్రీకారం చుట్టారు. రూ.15 లక్షల జిల్లా పరిషత్ నిధులతో సుబ్బారాయుడు గుడి నుంచి పోతిరెడ్డిపాలెం రోడ్డులో సుమారు 3 కిలోమీటర్ల గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి భూమి పూజలు నిర్వహించారు. అదేవిధంగా మండల పరిషత్ నిధులతో గ్రామంలోని సీతానగరం దారిని పునర్నిర్మిస్తున్నట్లు ఎంపీపీ గంజిమాల రామారావు తెలిపారు. ప్రధానంగా రైతులు పండించిన పంటను గమ్యస్థానాలకు చేరవేసేందుకు అనువుగా పుంత రోడ్లను అభివృద్ధి చేస్తున్నామని జెడ్పీటీసీ తెలిపారు. సర్పంచ్ ఏలేటి చిన్న తుక్కయ్య, ఎంపీటీసీ కొండేపాటి చింతయ్య, వైఎస్సార్‌సీపీ గ్రామ కన్వీనర్ కంచర్ల సత్యనారాయణ, కుర్రు నాగబాబు, ఉప సర్పంచ్ అనంతల సుబ్బారావు, మద్దిపట్ల నారాయణ, వూసా దామోదరం, శ్రీరంగ నిలయం కాశీ విశ్వనాథం, కె.నాగేశ్వరరావు, రేఖ, కోన గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలే పార్టీకి వెన్నెముక

రాష్ట్ర హోం శాఖ మంత్రి తానేటి వనిత


వైఎస్సార్ సీపీ నేతకు నివాళి అర్పిస్తున్న మంత్రి వనిత

ద్వారకాతిరుమల: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే బలమని, వారే పార్టీకి వెన్నెముక అని రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి తానేటి వనిత అన్నారు. గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమితులైన తరువాత గత నెల 25న ద్వారకాతిరుమలలో మంత్రి వనిత తొలి పర్యటన జరిగింది. అప్పటి నుంచి సోమవారం నల్లజర్ల మండలంలో జరిగిన పర్యటన వరకు నాయకులు, కార్యకర్తలతో ఆమె భేటీలు, సమావేశాలను నిర్వహించారు. కొంత కాలంగా పార్టీకి దూరంగా ఉంటున్న పలువురు నాయకులను కలిసి వారిని సమన్వయం చేసుకున్నారు. అలాగే కార్యకర్తలకు సైతం అధిక ప్రాధాన్యతనిస్తున్నారు. ఈ క్రమంలోనే ఈనెల 24న ద్వారకాతిరుమల మండలం తిమ్మాపురంలో జరిగిన పర్యటన సందర్భంగా గ్రామానికి చెందిన పార్టీ కార్యకర్త బయ్యరపు ఏడుకొండలు ఇటీవల మృతి చెందిన విషయం మంత్రి వనిత దృష్టికొచ్చింది. వెంటనే ఆమె బాధిత కుటుంబాన్ని పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. వారి కుటుంబానికి అండగా ఉంటానని మంత్రి భరోసా ఇచ్చారు.

పేదలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం


జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో కిట్లు అందజేస్తున్న ఎంపీపీ విజయలక్ష్మి, జెడ్పీటీసీ రమేష్

కామవరపుకోట: మారుమూల గ్రామాల్లోని పేదలకు సైతం మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ మేడవరపు విజయలక్ష్మి, జిల్లా విజిలెన్స్ కమిటీ మెంబర్, జెడ్పీటీసీ కడిమి రమేష్ అన్నారు. మండలంలో కేఎస్ రామవరం గ్రామంలో నిర్వహించిన రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో వారు మాట్లాడారు. గతంలో పేదలు సరైన వైద్యం అందక ఇబ్బందులు ఎదుర్కొనేవారని, కానీ ఇప్పుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా, రూపాయి ఖర్చు లేకుండా కార్పొరేట్ వైద్యం అందిస్తూ, ప్రతి ఒక్కరికి ఆరోగ్య భరోసా కల్పిస్తున్నారని అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రతి గ్రామంలో అనేక వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు, డాక్టర్ మనోజ్, డాక్టర్ జావిద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తి మృతిపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతిచెందిన ఘటన జంగారెడ్డిగూడెంలో చోటు చేసుకుంది. ఎస్సై జ్యోతిబాస్ తెలిపిన వివరాలివి. కామవరపుకోట మండలం జలవారిగూడెంకు చెందిన రాచప్రోలు శ్రీనివాస్ (41) మూడేళ్ల క్రితం భార్య, పిల్లలతో జంగారెడ్డిగూడెం వచ్చి నివాసం ఉంటున్నాడు. మద్యానికి బానిసైన అతను భార్య సత్యవతితో తరచూ గొడవలు పడుతూ ఉండేవాడు. మంగళవారం స్థానికంగా ఉన్న ఓ బార్ అండ్ రెస్టారెంట్ పక్కన ఖాళీ స్థలంలో శ్రీనివాస్ మృతిచెంది ఉండటాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు.సీఐ రాజేష్, ఎస్సై జ్యోతిబాస్ ఘటనా స్థలానికి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు. శ్రీనివాస్ భార్య సత్యవతి ఫిర్యాదు పోలీసులు కేసు నమోదు చేశారు.

2న కబడ్డీ జిల్లా జట్టు ఎంపిక

కామవరపుకోట: జిల్లా పురుషుల సీనియర్ కబడ్డీ జట్టు ఎంపిక మార్చి 2న నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీరాములు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపిక ప్రక్రియ శనివారం కామవరపుకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ ఎంపికలో పాల్గొనే క్రీడాకారులు బరువు 85 కేజీల లోపు ఉండాలని, 2 తేదీ మధ్యాహ్నం 2 గంటలకు క్రీడాకారులు తమ ఆధార్ జిరాక్స్‌తో రిపోర్టు చేయాలని తెలిపారు. ఇక్కడ ఎంపికైన పురుషుల కబడ్డీ జట్టు త్వరలో నెల్లూరు జిల్లా కోవూరులో నిర్వహించే పురుషుల సీనియర్ కబడ్డీ టోర్నమెంట్లో పాల్గొంటారని వివరించారు. ఇతర వివరాలకు 93986 62362కు ఫోన్ చేయాలని సూచించారు.

ఎన్నికల నియమావళి తూచ తప్పకుండా పాటించాలి

ఐటీడీఏ పీఓ, పోలవరం ఎన్నికల రిటర్నింగ్ అధికారి సూర్యతేజ


కేఆర్‌పురం ఐటీడీఏలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ సూర్యతేజ

బుట్టాయగూడెం: రాబోయే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తన నియమావళిని తూచ తప్పకుండా పాటించాలని ఐటీడీఏ పీఓ, పోలవరం ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.సూర్యతేజ ఆదేశించారు. మండలంలోని కేఆర్‌పురం ఐటీడీఏలో మంగళవారం పోలవరం నియోజకవర్గంలోని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌లు, తహసీల్దార్‌లు, సిబ్బందితో ఎన్నికల విధులకు సంబంధించి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ సూచన, మార్గదర్శకాల మేరకు ఎన్నికల నిర్వహణ పారదర్శకతతో నిర్వహించాల్సి ఉంటుందని చెప్పారు. ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన మౌలిక సదుపాయాలు, తదితర అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే విధుల నిర్వహణపై పలు సూచనలు ఇచ్చారు. విధి నిర్వహణలో ఎటువంటి నిర్లక్ష్యం వహించినా ఉద్యోగానికే ముప్పు వాటిల్లుతుందని హెచ్చరించారు. ఎన్నికల విధి నిర్వహణలో ఏవైనా సమస్యలు తలెత్తితే వాటి పరిష్కారానికి సంబంధిత ఎన్నికలపై అధికారులకు తెలియజేసి సమస్యలు పరిష్కరించాలని చెప్పారు. అలాగే ప్రతి ఒక్కరికీ ఎన్నికల నియమావళి పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్‌లు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌లు, సిబ్బంది, తదతరులు పాల్గొన్నారు.

బుట్టాయగూడెంలో 108 కలశాలతో ఊరేగింపు


గంగానమ్మ విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా కలశాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న మహిళలు

బుట్టాయగూడెం: గంగానమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా మంగళవారం బుట్టాయగూడెంలో 108 కలశాలతో భక్తులు భారీ ఊరేగింపు నిర్వహించారు. మంగళవాయిద్యాలు, తీన్మార్ డప్పులతో ఊరేగింపు ఉత్సాహంగా జరిగింది. గంగానమ్మ గుడి దగ్గర నుంచి అభయాంజనేయ స్వామి ఆలయం వరకూ మహిళలు కలశాలు తలపై పెట్టుకుని ఊరేగింపులో పాల్గొన్నారు. అలాగే అమ్మవారి ప్రతిమలను ఊరేగించారు. ఈ సందర్భంగా పురోహితులు అనిపెద్ది వెంకట రామకృష్ణశర్మ మాట్లాడుతూ గంగానమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం బుధవారం ఉదయం 10.02 నిమిషాలకు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. అనంతరం 11 గంటలకు అఖండ అన్నసమారాధన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని అన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

గ్రీన్‌ఫీల్డ్ హైవే రైతుల సమస్యలను పరిష్కరించాలి


మాట్లాడుతున్న శ్రీనివాస్

జంగారెడ్డిగూడెం రూరల్: గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతుల సమస్యలపై కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి న్యాయం చేయకపోతే పనులు అడ్డుకుంటామని గ్రీన్ ఫీల్డ్ భూ నిర్వాసిత రైతులు హెచ్చరించారు. మంగళవారం పేరంపేటలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతుల పోరాట కమిటీ ఆధ్వర్యంలో భూ నిర్వాసిత రైతుల సదస్సు నిర్వహించారు. ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతులకు ఆర్బిట్రేషన్ ద్వారా పరిహారం పెంచి న్యాయం చేస్తామని జిల్లా కలెక్టర్ ఇచ్చిన హామీ అమలు చేయలేదన్నారు. పరిహారం పెంచుతూ ఆర్బిట్రేషన్ జడ్జిమెంట్స్ వెంటనే ఇవ్వాలని కోరారు. సర్వీస్ రోడ్లు ప్రొవిజన్ కల్పించి బీటీ రోడ్లు నిర్మాణం చేయాలని కోరారు. ఈసమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బొడ్డు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ ఉత్సవాలు ప్రారంభం


శ్రీ దాసాంజనేయ స్వామి విగ్రహ పునఃప్రతిష్ఠలో భాగంగా యాగశాల ప్రవేశ పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: రాజవరం పంచాయతీ మంగపతిదేవిపాలెంలో నూతనంగా నిర్మించిన శ్రీ దాసాంజనేయ స్వామి ఆలయ ఉత్సవాలు మంగళవారం నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా భూత బలి, యాగశాల ప్రవేశం, విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, పంచగవ్యం, దీక్షాధారణ, అఖండ దీపారాధన తదితర శాస్త్రోక్త పూజలు ఆగమపండితులచేత నిర్వహించారు. మూడు రోజులపాటు సాగే ఉత్సవాలలో భాగంగా ప్రతిరోజు విశేష పూజలు భక్త దంపతుల చేత నిర్వహింపచేయనున్నట్లు ఆలయ నిర్మాణ ధర్మకర్తలు పేర్కొన్నారు. మాజీ సర్పంచ్ వాడపల్లి రాధాకృష్ణ పర్యవేక్షణలో వాడపల్లి బ్రదర్స్ ఆధ్వర్యంలో నూతన ఆలయం నిర్మించగా శ్రీ దాసాంజనేయ స్వామి వారితో పాటుగా గణపతి, సుబ్రహ్మణ్యస్వామి విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమం 29వ తేదీ నిర్వహించనున్నారు.

నేడు రైతు భరోసా పంపిణీ

కొయ్యలగూడెం: రైతు భరోసా పీఎం కిసాన్, సున్నా వడ్డీ పంట రుణాలు ఎమ్మెల్యే తెల్లం బాలరాజు చేతుల మీదుగా బుధవారం పంపిణీ చేయనున్నట్లు ఏడీఏ పి.బుజ్జి బాబు తెలిపారు. స్థానిక అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ భవనాల ప్రాంగణంలో ఉదయం పది గంటలకు ఖరీఫ్, రబీ సీజన్లకు సంబంధించి నియోజకవర్గంలోని రైతులకు వీటిని ఎమ్మెల్యే అందజేస్తారని అన్నారు. దాదాపు 9,556 మంది రైతులకు సుమారు ఒక కోటి అరవై లక్షల రూపాయల లబ్ధి చేకూరుతుందన్నారు.

మంత్రి వనితకు సత్కారం


పద్మ జ్యోతి శ్రీనివాస్ దంపతుల నివాసంలో మంత్రి వనితతో పార్టీ నేతలు

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల శ్రీవారి దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యురాలు పెద్దిరెడ్డి వెంకట కొండ పద్మ, జ్యోతి శ్రీనివాస్ ఏలూరులోని నివాసానికి రాష్ట్ర హోం శాఖామంత్రి తానేటి వనిత మంగళవారం సాయంత్రం విచ్చేశారు. ఈసందర్భంగా మంత్రి వనితకు పద్మ, జ్యోతి శ్రీనివాస్ దంపతులు పూల బొకేను అందించి స్వాగతం పలికారు. అనంతరం ఆమెకు దుశ్శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. అనంతరం ద్వారకాతిరుమల మండలానికి చెందిన జెడ్పీటీసీ చిగురుపల్లి శ్యామూల్, శ్రీవారి దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు మానుకొండ సుబ్బారావు, పార్టీ నాయకులు ఆచంట బన్ను, బోళ్ల శ్రీను, గంటా శేఖర్ ఆమెను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఆ తర్వాత స్థానిక రాజకీయాలపై మంత్రి వారితో చర్చించారు.

వలంటీర్ల సేవలు అభినందనీయం


శ్రీనివాసపురంలో వలంటీర్లను సత్కరించిన జెడ్పీటీసీ బాబ్జి


జంగారెడ్డిగూడెం రూరల్: వలంటీర్లు అందిస్తున్న సేవలు అభినందనీయమని జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి అన్నారు. మండలంలోని శ్రీనివాసపురం సచివాలయంలో మంగళవారం సేవామిత్ర పురస్కారాలకు ఎంపికైన 21 మంది వలంటీర్లను జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, సర్పంచ్ యడ్లపల్లి రాధిక, ఉప సర్పంచ్ పోల్నాటి శ్రీనివాసరావు సత్కరించారు. ఈసందర్భంగా బాబ్జి మాట్లాడుతూ వలంటీర్లు, సచివాలయాల వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకే ప్రభుత్వం సంక్షేమ పాలనను తీసుకొచ్చిందన్నారు. ఈకార్యక్రమంలో సచివాలయాల కన్వీనర్లు సిర్రా రాజేష్, కట్టా బేబి, పోల్నాటి రాజు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం


పట్టిన్నపాలెంలో మందులను పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ బాబ్జి

జంగారెడ్డిగూడెం రూరల్: రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను నిర్వహిస్తుందని జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి అన్నారు. పట్టిన్నపాలెంలో మంగళవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని జెడ్పీటీసీ బాబ్జి ప్రారంభించారు. వైద్యులు, వైద్య సిబ్బంది ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పసుపులేటి రత్నకుమారి, ఎంపీడీవో కె. విజయ్ ప్రసాద్, సచివాలయ కన్వీనర్ పసుపులేటి నాగార్జునరావు పాల్గొన్నారు.

సెపక్‌తక్రా పోటీల్లో ప్రతిభ


భవ్యశ్రీని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ద్వారకాతిరుమల: మండలంలోని రామసింగవరం జెడ్పీ ఉన్నతపాఠశాల విద్యార్థిని పి.బాల భవ్యశ్రీ రాష్ట్ర స్థాయి సెపక్‌తక్రా పోటీల్లో గోల్డ్‌మెడల్ సాధించింది. ఈ నెల 24, 25 తేదీల్లో నెల్లూరు జిల్లాలో ఈ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జూనియర్స్ విభాగంలో ముగ్గురు విద్యార్థినులు ప్రథమ స్థానం సాధించగా, అందులో బాల భవ్యశ్రీ ఉంది. సెపక్‌తక్రా క్రీడలో రాణిస్తున్న ఈ విద్యార్థినిని హెచ్ఎం జె.సుభాకర్, పాఠశాల పీడీ ప్రసాద్ తదితరులు అభినందించారు.

నేడు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని లక్కవరంలో బుధవారం చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా పర్యటించనున్నారు. రూ.10 లక్షల నిధులతో సీసీ డ్రెయినేజీ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేయనున్నారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ వర్గాలు తెలిపాయి.